బయటకు రావటాన్ని అతను పట్టించుకో లేదు.

అవి దాదాపు గంట ముందే పాండు డాబా మీద నుండి విసిరిన మాంసం ముద్ద తిని ఉన్నాయి. దానిలో తను తెచ్చిన నిద్ర మాత్రలు మెత్తగా నూరి కలిపి ఉంచాడు అతను. ఆ మత్తు వాటి నరాల్లోకి మెల్ల మెల్లగా చేరుతుంది.

అందుకే అవి ఎప్పటిలా చురుకుగా కాక.. నెమ్మదిగా ఇంటి వెనుకకు వెళ్లి... సౌకర్యంగా ఉన్న స్థలం చూసుకుని మత్తు లోకి జారుకున్నాయి.

తరువాత తనతో తెచ్చిన నైలాన్ తాడు డాబా మీద వాటర్ ట్యాంకుకి కట్టాడు. తాడు రెండవ చివర ఇంటి బెడ్‌రూమ్ వెంటిలేటర్ వద్ద ఆగింది.

దానిని పట్టుకుని వెంటిలేటర్ వరకూ జారిన అతను వెంటిలేటర్‌కు ఉన్న గ్లాసు పలకలు ఒకటొకటిగా తొలగించి... వాటిని శబ్దం రాకుండా డాబా మీదకు చేర్చాడు.

తరువాత తన ఊపిరితిత్తులలోని గాలిని సాధ్యమైనంత బయటకు వదిలి తన శరీరాన్ని వెంటిలేటర్ నుండి బెడ్‌రూ మ్‌లోకి చొప్పించటం మొదలుపెట్టాడు.

అసాధ్యమనిపించే ఫీట్లు ప్రదర్శించే చైనీస్ సర్కస్ కళాకారుల్లాగా చీమ చిటు క్కుమనే శబ్దం కాకుండా అతని శరీరం పాదరసం జారినట్లు ఆ ఖాళీ నుండి బెడ్ రూమ్‌లోకి జార సాగింది.

పూర్తిగా తను బెడ్‌రూమ్‌లోకి దిగక ముందే... బయట వేలాడుతున్న నైలాన్ తాడును కూడా వెంటిలేటర్ నుండి బెడ్ రూమ్ లోకి జార్చి తను తిరిగి వెళ్లటానికి మార్గం సుగమం చేసుకున్నాడు.

నెమ్మదిగా గదిలోకి దిగిన అతను చుట్టూ పరికించి చూశాడు.

గులాబ్‌చంద్ ఇద్దరు పిల్లలు ఆ గదిలో నిద్రపోతున్నారు.

నిశ్శబ్దంగా ఆ గది నుండి బయటకు వచ్చాడు. డూప్లెక్స్ పద్ధతిలో కట్టబడిన ఆ భవనంలో బెడ్‌రూములు పైన ఉంటే.. హాల్, డైనింగ్‌రూమ్, కిచెన్ కింద ఉన్నాయి.

కింద హాల్‌లో నుండి మాటలు వినిపి స్తున్నాయి. అడుగులో అడుగు వేసు కుంటూ రెయిలింగ్ వరకూ వెళ్లి అక్కడి నీడలో నిలబడి కిందకు తొంగి చూశాడు.

బాజీరావు, గులాబ్‌చంద్ హాల్‌లోని సోఫాలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"చెయ్యవలసింది అర్థమయింది కదా!... ఎక్కడా పొరపాటు మాట్లాడకూడదు..." చెప్తున్నాడు బాజీరావు.

"జరగని దొంగతనం జరిగిందని చెప్పా లంటే... కొద్దిగా జంకుగా ఉంది..." నసుగుతున్నాడు గులాబ్‌చంద్?

"నువ్వు చేయవలసింది ఏమీ లేదు... మొత్తం నేను చూసుకుంటాను... ఉద యాన్నే దొంగతనం జరిగిందని నాకు ఫోన్ చేసి చెప్పు. పత్రికల వాళ్లకి చెప్పవ లసింది చెప్పి నేను మేనేజ్ చేస్తాను. డోంట్ వర్రీ.."

తప్పక, "సరే!" అంటూ తల ఊపాడు గులాబ్‌చంద్.

"అన్నట్లు... నీ ఇనపెట్టె తాళాలు

ఎక్కడ పెడతావ్? "

"అవి ఎప్పుడూ నా కళ్ళ ముందే ఉంటాయి..." ఎదురుగా టీపాయ్ మీద ఉన్న తాళాలు చూపిస్తూ చెప్పాడు. "రాత్రి నిద్రపోయేటప్పుడు కూడా తాళాలు నా బొడ్లోనే ఉంటాయి"

"వెరీ గుడ్!... ఇక నేను వెళ్తాను..." లేచాడు బాజీరావు.

ఇంట్లోనే నిలబడి... "గూర్ఖా!" గట్టిగా పిలిచాడు గులాబ్‌చంద్. "కుక్కల్ని కట్టి వేసి గేటు తియ్!... త్వరగా!!"

గూర్ఖా పరుగెత్తుకుంటూ వచ్చి జేబులో నుండి విజిల్ తీసి ఊదాడు.

ఆ విజిల్ వినగానే కుక్కలు పరుగెత్తుకుంటూ రావాలి. అయితే ప్రస్తుతం వాటి జాడే లేదు.

మరో రెండుసార్లు విజిల్ ఊదిన గూర్ఖా ఏం జరిగిందో చూడటానికి ఇంటి వెనకకు వెళ్లాడు.

అసహనంగా అక్కడే నిలబడ్డారు ఇద్దరూ!

వారు అక్కడ నిలబడింది కొన్ని నిమిషాలయినా... అనేక యుగాల్లాగా అనిపిస్తుంది వారికి జరుగుతున్న ఆలస్యం.

ఇంతలో పరుగెత్తుకుంటూ వచ్చాడు గూర్ఖా. అతని మొహం ఆందోళనతో నిండిపోయి ఉంది. "సాబ్... సాబ్!!... కుక్కలు రెండూ స్పృహ లేకుండా పడి ఉన్నాయి సాబ్..." పెద్దగా అరుస్తూ చెప్పాడు గూర్ఖా.

బాజీరావుకి ఏదో జరుగుతోందని అర్థం అయింది.

బహుశా తను ఆడించదలుచుకున్న నాటకం నిజంగా జరుగుతోందా?

అలా అయితే దొంగ ఏడీ?

ఇప్పటికే ఇంట్లోకి వెళ్ళి ఉంటాడా? ...

ఆ అనుమానం రాగానే ఇంట్లోకి పరుగెత్తాడు బాజీరావు.

గులాబ్‌చంద్ అయోమయంగా అతనిని అనుసరించాడు.

హాల్‌లో టీపాయ్ మీద ఉండవలసిన ఇనప్పెట్టె తాళాలు లేవు. వాటి స్థానంలో ఒక తెల్ల కాగితం రెపరెపలాడుతుంది.

గులాబ్‌చంద్ "మర్ గయారే!" అని అరుస్తూ గబగబా మెట్లెక్కి ఇనప్పెట్టె ఉన్న గదివైపు పరుగు తీశాడు.

బాజీరావు తెల్ల కాగితం చేతిలోకి తీసుకుని తెరచి చూశాడు. అతనిని ఆశ్చర్యపరుస్తూ అది అతనినే సంబోధించి ఉంది.

బాజీరావ్!

అన్యాయంగా రామకోటిని బాధపెట్టే ఆలోచనలు మానుకో! రామకోటి మీద దొంగకేసు సంగతి తరువాత ఆలోచిద్దువు. ముందు ఇప్పుడు జరిగిన దొంగసొమ్ము రికవరీ గురించి ఆలోచించు.

ఇంకా నీ ఆరాచకాలు రామకోటి మీద ఇలాగే కొనసాగితే... ఈ సారి మేము చొరబడేది నీ ఇంట్లోకే! అయితే ఈ సారి మేము ఎత్తుకు పోయేది నీ సొమ్ములు కాదు... నీ కొడుకు ప్రాణాలు!

మర్యాదగా రామకోటిని వదిలిపెట్టిన మరుక్షణం ఇప్పుడు దోచుకున్న సొమ్ము మీకు క్షేమంగా చేరుస్తాం...

ఆపై మీ ఇష్టం!

కింద ఎవరి సంతకం లేదు.

ఇంతలో అతని ఆలోచనలను భగ్నం చేస్తూ పైనుండి గులాబ్‌చంద్ అరచిన అరుపు వినిపించింది.

పైకి పరుగెత్తుకుంటూ వెళ్ళిన బాజీరావుకు... తెరచి ఉంచిన ఇనప్పెట్టె, దాని ముందు నెత్తిన చెంగువేసుకు కూర్చున్న గులాబ్‌చంద్ కనిపించారు.

అప్పటికే ఇంట్లో అందరూ నిద్రలేచి గులాబ్‌చంద్ శోకాల్లో పాలు పంచుకుంటున్నారు.

"ష్ష్ష్..." గట్టిగా అన్నాడు బాజీరావు. "మీ సొమ్ము ఎక్కడికీ పోదు... గొడవ చెయ్యకండి..." అనునయిస్తూ చెప్పాడు.

"ఎక్కడికీ పోదేంటయ్యా... ఎప్పుడో పోయింది..." ఇంకా శృతి పెంచుతూ అన్నాడు గులాబ్‌చంద్.

"నోర్ముయ్యండి... ఎవరన్నా నోరు తెరిస్తే కాల్చి పారేస్తాను..." అంటూ రివాల్వర్ తియ్యబోయాడు బాజీరావు.

అప్పుడు కానీ... అందరూ శోకాలు ఆపలేదు.

"మీ సొమ్ము తెచ్చి ఇచ్చే బాధ్యత నాది. కానీ... ఈ విషయం ఎవరికీ తెలియకూడదు..." అంటూ వడివడిగా బయటకు వెళ్ళిపోయాడు.

అప్పటిదాకా జరగని దొంగతనం జరిగిందని ఎందుకు చెప్పమన్నాడో... ఇప్పుడు జరిగిన దొంగతనాన్ని ఎందుకు ఎవరికీ చెప్పవద్దంటున్నాడో... గులాబ్‌చంద్‌కి అర్థం కాలేదు.

మరుసటి రోజు ఉదయాన్నే రామకోటి ఇంటికి చేరాడు. ఆ తరువాత కాసేపటికి బాజీరావుకి ఫోన్ వచ్చింది- పోయిన నగలు గులాబ్‌చంద్ ఇంటిపైన వాటర్ ట్యాంకులో ఉన్నాయని.

బాజీరావు ఎంత ప్రయత్నించినా... ఆ రోజు దొంగతనం చేసింది ఎవరో తెలియలేదు.

అతను ఆ తరువాత రామకోటి జోలికి రాలేదు. కానీ... అతను సరైన సమయం కోసం ఎదురుచూస్తూ మాత్రమే ఊరుకున్నాడని పాండుకి తెలియదు.




**రో**జులు ఎప్పుడూ లేనంత ప్రశాంతంగా గడిచి పోతున్నాయి.

రామకోటి ఎన్నిసార్లు అడిగినా పాండు నవ్వి ఊరుకున్నాడు తప్ప... ఆ రోజు ఏం జరిగిందో చెప్పలేదు.

పాండు డిగ్రీ పూర్తికావటం, యూ.పీ.ఎస్.సీ. పరీక్షల్లో పాస్ అయి ఇంటర్వ్యూకి సెలక్ట్‌కావటం... అదేదో సహజమయిన విషయాల్లాగా జరిగిపోయాయి.

అతను తన మేధనంతా లగ్నం చేసి ఇంటర్వ్యూకి ప్రిపేర్ అవుతున్నాడు.

అలాంటి సమయంలో ఒక రోజు మిట్ట మధ్యాహ్నం పూట వారి ఇంటికి పోలీసు కానిస్టేబుల్ వచ్చాడు.

ఈ మధ్య రామకోటి ఇంటికి పోలీసులు వచ్చి చాలా కాలమయింది. మరలా ఇన్ని రోజుల తరువాత వచ్చిన కానిస్టేబుల్ రాక అందరినీ ఆశ్చర్యపరచింది.

"ఒకసారి బాజీరావుగారు వచ్చి కనిపించమన్నారు..." కాంతం ఇచ్చిన మంచినీళ్ళు తాగుతూ, రామకోటిని ఉద్దేశించి చెప్పాడు వచ్చినతను.

దీర్ఘంగా నిట్టూర్చి, "ఎప్పుడు రమ్మ

న్నారు? " అడిగాడు రామకోటి.

"నీ యిష్టం... వీలయినపుడు రమ్మన్నారు..."

ఆ మాటతో అప్పటివరకూ జరుగుతున్నది మౌనంగా చూస్తున్న పాండులో టెన్షన్ తగ్గిపోయింది.

బాజీరావు మరలా తన తండ్రిని ఏ కేసులోనో ఇరికించే ఉద్దేశంలో ఉన్నట్లయితే... ఇలా తీరిగ్గా సమయం ఉన్నప్పుడు వచ్చి కలవమని చెప్పడు. ఉన్నవాడిని ఉన్నట్లు తీసుకువెళ్ళేవారు. ఆ ధైర్యంతో పాండు తిరిగి తన చదువులో మునిగిపోయాడు.

ఆ సాయంత్రం రామకోటి బాజీరావుని కలుసుకున్నాడు.

పోలీస్‌స్టేషన్ చాలా ప్రశాంతంగా ఉంది.

బాజీరావు కూడా రామకోటిని చూడగానే నవ్వుతూ ఆహ్వానించి ఎదురుగా కూర్చోమన్నాడు.



"వద్దులే సార్..." చేతులు కట్టుకుని నిలబడ్తూ అన్నాడు రామకోటి. కూర్చోమని బలవంతం చెయ్యలేదు బాజీరావు.

చాలా సేపు ఆలోచిస్తున్నట్లు ఉండిపోయి చివరకు తప్పదన్నట్లు మొదలుపెట్టాడు.

"చూడు రామకోటీ... నీ మీద నాకు చాలా కోపం! ఎంతకోపం అంటే, నిన్ను చంపెయ్యాలన్నంత కోసం!! కానీ... ఇన్ని రోజులూ నా కోపాన్ని నాలోనే అణచుకోవలసి వచ్చింది. కారణం... నీ తరుపున నాకు అందిన బెదిరింపు. చిన్న చిన్న కారణాలతో తగాదాలు పెద్దవి చేసుకోవటం నాకు ఇష్టం ఉండదు. అందుకే ఇన్ని రోజులూ నేను నీ జోలికి రాలేదు. అయితే ఇప్పుడు మరలా నీ అవసరం పడింది. ఒక పని జరగాలి. అది ఎంతో పెద్ద పని. నీలాంటి వాడివల్ల తప్ప జరగని పని. అందుకే నిన్ను పిలిపించవలసి వచ్చింది..."

రామకోటి అభ్యంతరం చెప్పబోయాడు.



"నాకు తెలుసు రామకోటీ!... నాకు తెలుసు. 'దాదాపు మరణం అంచుల వరకూ తీసుకువెళ్ళినా ఒప్పుకోని వాడిని... ఇప్పుడు మాత్రం ఈ పని ఎందుకు చేస్తానని...' అనాలనుకుంటున్నావు కదూ! కరక్టే... అయితే! రామకోటీ నీ మరణాన్ని నువ్వు లెక్కచెయ్యలేదు! ఎందుకూ? ... నీ కొడుకు భవిష్యత్తు కోసం. అవునా! ...మరి నీ కొడుకు భవిష్యత్తే అనుమానంలో పడిందనుకో..."

రామకోటి కళ్ళు కోపంతో ఎర్రగా మారాయి. ఆవేశంతో ఏదో అనబోయాడు.

"అంత ఆవేశం వద్దు రామకోటీ... నేను చెప్పేది ప్రశాంతంగా విను! ముందుగా ఇదిగో... ఇది చూడు. నీ కొడుకు గురించి రిపోర్టు పంపమని ఢిల్లీ నుండి వచ్చిన కాగితాలు. హాయిగా కలెక్టర్ కావలసిన వాడు నీ కొడుకు. మన మధ్య గొడవలతో అతని భవిష్యత్తు చెడగొట్టకు." టేబుల్ సొరుగులోంచి కాగితాలు తీసిచూపిస్తూ అన్నాడు బాజీరావు.

అతని చేతిలోని కాగితాలు చూడగానే రామకోటి ఆవేశం చప్పున చల్లారింది. "నా